నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 15 నవంబర్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

- చేపల సీడ్‌లో నాణ్యత తలోపం
- మత్స్యశాఖపై మంత్రి జూపల్లి అసహనం
- ఫిషరీస్ ఏడీపై మత్స్యకారుల ఆరోపణలు

చేపపిల్లల నాణ్యతపై అనుమానాలు

నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో చేప పిల్లల సీడ్ నాణ్యత, సైజ్ పలు అనుమానాలకు తావిస్తోంది. బుధవారం కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామ సమీపంలోని కృష్ణానదిలో చేప పిల్లల పరిమాణం చిన్నగా ఉన్నదని మంత్రి జూపల్లి అసహనం వ్యక్తం చేసిన విషయం విదితమే.. నదిలో వదలొద్దని వెనక్కి పంపించారు. అయితే సింగోటం రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి అధికారులు లేకుండా కొంతమంది మాత్రమే మిక్స్ చేసిన సైజ్ తక్కువ ఉన్న చేపపిల్లల తోపాటు మత్స్యకారులు అభ్యంతరం వ్యక్తం చేసిన మెరుగాల చేప పిల్లలను సింగోటం రిజర్వాయర్‌లోకి వదిలారు. ఓ వైపు మంత్రి చేపపిల్లలను రిజెక్టు చేస్తే.. మరో వైపు రిజర్వాయర్‌లో వదలడంపై మత్స్యకారులు, చేపల సీడ్ గుత్తేదారులు, అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

రాష్ట్ర మత్స్యసహకార సంఘాల సమైక్య చైర్మన్ సాయికుమార్‌ను కలిసి నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రభుత్వం అందిస్తున్న చేపపిల్లలు నాణ్యతగా లేవని ఫిర్యాదు చేస్తున్న డీఎఫ్‌ఓ, డీఎఫ్‌ఓ చైర్మన్ అంజనేయులు, జిల్లా మత్స్యకార సంఘం సభ్యులు (ఫైల్)

చేపా.. చేపా.. ఎందుకు పెరగలే!

తెలంగాణ ప్రభుత్వం మత్స్యకారులు ఆర్థిక సమృద్ధి సాధించాలని చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు, నదుల్లో ఉచితంగా ప్రతి సంవత్సరం చేప పిల్లలను విడుదల చేసేది. దీంతో మత్స్యకారుల జీవితాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. కేసీఆర్ ప్రభుత్వంలో మత్స్యకారులు కోరుకునే విధంగానే నాణ్యమైన చేపల సీడ్స్‌ను జూన్ నుంచి ఆగస్టు లోపు పంపిణీ చేసేది. కానీ ప్రభుత్వం మారడంతోనే మత్స్యకారుల జీవితాల్లో చీకటి కమ్ముకున్నది. పేరుకు మాత్రం చేపల సీడ్‌ను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నా సరైన సమయంలో అందించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అక్టోబర్ 7వ తేదీ నుంచి నాణ్యత లోపం, తక్కువ సైజ్ చేపపిల్లలను పంపిణీ చేస్తున్నారని, దీంతో చేపల వృద్ధి ఉండదని, చలికాలంలో ఎదుగుదల మందగిస్తదని మత్స్యకారులు చెబుతున్నారు.

అధికారిణిపై ఆరోపణలు

జిల్లా మత్స్య శాఖా డైరెక్టరిణిపై మత్స్యకారులు అవినీతి, ఆరోపణలు చేస్తున్నారు. గత నెల అక్టోబర్ 29న జిల్లా మత్స్యశాఖా డైరెక్టరిణి అరాచకాలు, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై మోసం చేయడం, కులం పేరుతో బెదిరిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మళ్లీ బుధవారం ఆమెను సస్పెండ్ చేయాలని మంత్రి జూపల్లికి ఫిర్యాదు చేశారు. మత్స్యకారుల జీవనోపాధి కోసం ఇస్తున్న చేప పిల్లల పంపిణీపై సమగ్ర విచారణ జరిగిప్పుడు మాత్రమే నిజానిజాలు బయటకు వస్తాయని మత్స్యకార సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

అధికారుల సమక్షంలో విడిచిపెట్టాం..

సింగోటం రిజర్వాయర్‌లో చేప పిల్లలను అధికారుల సమక్షంలో వదిలామని, ఇందులో తమ తప్పు ఏమీ లేదని జిల్లా మత్స్యశాఖ అధికారిణి రజని పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో విడిచిపెట్టిన చేపపిల్లల సంఖ్య గురించి 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా ఇంకా తన వద్దకు సమాచారం రాలేదని తెలిపారు.

సైజ్ తక్కువగా ఉన్న చేపపిల్లలు

నిబంధనలకు నీళ్లు

నాగర్‌కర్నూల్ జిల్లా మత్స్యకార శాఖ అధికారులు చేప సీడ్ పంపిణీపై భారీ అవినీతికి పాల్పడుతున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ఒక డీసీఎంలో లక్ష చేప పిల్లలు ఉంటాయని దొంగ లెక్కలు కడుతున్నట్లు చెబుతున్నారు. చేపపిల్లల సీడ్ లెక్కించిన చోట సొసైటీలపై అధికారులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 230 దాకా మత్స్యకార సొసైటీలు ఉన్నాయి. బొచ్చ 35 శాతం, రవట 35, బంగారుతీగ 30 విడివిడిగా ఉండాలి. కానీ అన్ని చేప పిల్లలను మిక్స్ చేసి సైజ్ కొద్దిగా పెద్దగా ఉండే బొచ్చ చేప పిల్లల సీడ్‌ను స్కేల్‌తో కొలుస్తున్నట్లు మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. అంతేకాదు మెరగాల కట్టీ బ్రీడ్‌ను పంపిణీ చేస్తున్నట్లు విమర్శిస్తున్నారు. పంపిణీ చేసే సీడ్ సైజ్ కూడా 15 మి.మీ. నుంచి 30 మి.మీటర్ల లోపు ఉన్నట్లు పేర్కొంటున్నారు.

'చేపా.. చేపా ఎందుకు పెరగలేదంటే.. నాకు తెలియదు చేపలు పట్టే మత్స్యకారులను అడుగు.. చేపా.. చేపా.. ఎందుకు సన్నగా ఉన్నావంటే నాకు తెలియదు.. నాకు తిండి పెట్టని గుత్తేదారుడిని అడుగు.. చేపా.. చేపా ఎందుకు తక్కువ పరిమాణంలో ఉన్నావంటే.. నాకు తెలియదు.. నాపై కమీషన్ వేసుకొని భాగాలు పంచుకున్న వారిని అడుగు'.. అందంట చేప. రెండు ఇంచుల చేప పిల్లల పై భాగాలు తెలియాలంటే ముందు నాగర్‌కర్నూల్ జిల్లాలో మత్స్యశాఖలో జరుగుతున్న గందరగోళం గురించి తెలియాలి.

- మహబూబ్‌నగర్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)


వాహనాలు నిలిపివేయడంతో నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి

మారనున్న 'చావురాస్తా' రూపురేఖలు

- బాలానగర్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణానికి ఏర్పాట్లు

బాలానగర్, నవంబర్ 14 : మండల కేంద్రంలోని జాతీయ రహదారి-44పై ఉన్న చావురాస్తా రూపురేఖలు మారబోతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో వంద లాది మంది అమాయకుల ప్రాణాలు బలి గొన్న కూడలి వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. మొత్తమ్మీద పై వంతెన నిర్మాణ పనుల్లో కదలిక వచ్చింది. నిర్మాణంలో భాగంగా ముందుగా ట్రాఫిక్‌ను దారి మళ్లించే పనులు ప్రారంభమయ్యాయి. ఇటు బెంగళూరు.. అటు హైదరాబాద్‌వైపు వెళ్లే వాహనాల కోసం బాలానగర్‌లో హైవే అనుసంధానంగా ఉన్న సర్వీస్ రోడ్లపై నుంచి వాహనాలను మళ్లించారు. వేగంగా వెళ్లకుండా ఉండేలా సర్వీసు రోడ్లపై పలుచోట్ల స్పీడ్ బ్రేకర్లు వేశారు. ఎస్సీ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు సర్వీసు రోడ్లను అనుసరించి ఏర్పాటు చేసిన అల్పాహారం బండ్లు, పండ్లు, పూలు వంటి వ్యాపార సంబంధమైన తోపుడు బండ్లను తొలగించారు.

సర్వీసు రోడ్డుపై వెళ్తున్న వాహనాలు

రాష్ట్రపతిని కలిసిన నవాబ్‌పేట విద్యార్థులు

నవాబ్‌పేట, నవంబర్ 14 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గురువారం బాలల దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. రాష్ట్రపతి భవన్ ప్రత్యేక ఆహ్వానం మేరకు పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థులతో కలిసి జీహెచ్ఎం నాగ్యానాయక్, ఉపాధ్యాయులు శ్రీధర్, లక్ష్మణ్‌సాయి, కళ్యాణి, కృష్ణ దేశ రాజధానికి వెళ్లి రాష్ట్రపతికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు ఫోన్‌లో 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ రాష్ట్రపతిని కలవడం ఆనందంగా ఉందన్నారు.

కబడ్డీలో తలపడుతున్న పెద్దకొత్తపల్లి, అచ్చంపేట జట్లు, బహుమతులను ప్రదానం చేస్తున్న ఎస్సై నాగరాజు

- లింగాలలో ముగిసిన జోనల్ స్థాయి పోటీలు
- క్రీడలపై ఆసక్తి చూపాలి : ఎస్సై నాగరాజు

రసవత్తరంగా..

లింగాల, నవంబర్ 14 : మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల క్రీడా మైదానంలో నాలుగు రోజులుగా జరుగుతున్న జోనల్ స్థాయి క్రీడలు ముగిసాయి. గురువారం పోటీలు హోరా హోరీగా కొనసాగాయి. అండర్ -14 కబడ్డీ విజేత అచ్చంపేట నిలవగా.. రన్నర్‌గా పెద్దకొత్తపల్లి, ఖోఖోలో దామరగిద్ద గెలవగా.. లింగాల రన్నర్‌గా నిలిచింది. టెన్నికాయిట్‌లో హేమ చరణ్ (బాలానగర్), శ్రీకాంత్ (జేపీనగర్), చదరంగంలో లింగాల విజేతగా నిలవగా.. రన్నర్‌గా జేపీనగర్, క్యారమ్స్ విభాగంలో భరత్ (జేపీనగర్), రన్నర్‌గా అభినయ్, సిద్ధార్థ (పెద్దకొత్తపల్లి), అచ్చంపేట చాంపియన్‌గా నిలిచింది. అండర్-17 కబడ్డీ విజేతగా ఇటిక్యాల, రన్నర్ దేవరకద్ర, ఖోఖోలో విజేత దామరగిద్ద, రన్నర్‌గా జేపీ నగర్, వాలీబాల్ విజేత అయిజ, రన్నర్‌గా అచ్చంపేట, బాల్‌బ్యాడ్మింటన్ విజేత ఇటిక్యాల, రన్నర్‌గా లింగాల, హ్యాండ్‌బాల్ విజేత బాలానగర్ నిలిచింది. అండర్-19 విభాగం కబడ్డీలో విజేతగా లింగాల, రన్నర్‌గా ఇటిక్యాల, ఖోఖో విజేత జేపీనగర్, రన్నర్‌గా మదనాపురం, వాలీబాల్ విజేత లింగాలకు బహుమతులను ప్రదానం చేశారు. పోటీలకు హాజరైన ఎస్సై నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల్లో మెళకువలు నేర్చుకొని మంచి క్రీడాకారుడిగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు.

30 మందికి షోకాజ్ నోటీసులు

- సర్వేకు సమయానికి వెళ్లడం లేదని ఉద్యోగులపై చర్యలు

వనపర్తి, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో పాల్గొనని పలువురు ఉద్యోగులకు కలెక్టర్ ఆదర్శ్ సురభి షోకాజ్ నోటీసులను జారీ చేశారు. అయితే, ప్రభుత్వం కేటాయించిన సమయానికి సర్వేకు వెళితే ఇండ్ల దగ్గర ప్రజలు ఉండటం లేదని ఉద్యోగులు చెబుతున్నారు. మాకు కేటాయించిన సర్వేను మా గడువులోపు పూర్తి చేస్తామని షోకాజ్ నోటీసులు అందుకున్న ఉద్యోగులంతా గురువారం కలెక్టర్‌కు ప్రత్యేక వినతి చేసుకున్నారు. అయితే, మధ్యాహ్నం వరకు బడిలో పాఠాలు చెప్పి ఆ తర్వాత ఇంటింటి సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆ సమయంలో వెళితే జనం అందుబాటులో ఉండక పోవడంతో పలువురు ఉద్యోగులు ఉదయం, సాయంత్రం వేళల్లో సర్వేను చేసుకుంటామన్నట్లు చెబుతున్నారు. మధ్యాహ్నం వేళల్లో సర్వేలో ఉండటం లేదని ఇటీవలే వనపర్తి, పెబ్బేరు, శ్రీరంగాపురం, అమరచింత, పీపనగండ్ల మండలాలకు దాదాపు 30 మందికిపైగా ఉపాధ్యాయులకు, ఇతర ఉద్యోగులకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

రేవల్లి సీహెచ్‌సీ ఎదుట తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కార్మికులపై అదనపు పనిభారం పడిందని, జీవో-60 ప్రకారం రూ. 12,093 వేతనాలు చెల్లించాలని సురేశ్ డిమాండ్ చేశారు. ఏజెన్సీ కాంట్రాక్టర్ వేతనాలు ఇవ్వకపోవడంతో పెండింగ్‌లో ఉన్నాయని, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపుల్లో ఇష్టం వచ్చినట్లు కటింగ్ చేస్తున్నారని వాపోయారు. - రేవల్లి, నవంబర్ 14

పర్మన్‌దొడ్డి నర్సరీలో చెల్లాచెదురుగా పడి ఉన్న మొక్కలు, భైరంపల్లి గ్రామంలో పిచ్చిమొక్కలతో నిండిపోయిన నర్సరీ

నిర్లక్ష్యం మొలకెత్తింది!

- నర్సరీల్లో మొక్కలకు బదులుగా పచ్చగడ్డి
- పట్టించుకోని అధికారులు

మాగనూర్, నవంబర్ 14 : నర్సరీల నిర్వహణలో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోంది. వనమహోత్సవం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా.. అవన్నీ పచ్చగడ్డిపాలవుతున్నాయి. మండలంలోని భైరంపల్లి, పర్మన్‌దొడ్డి గ్రామాల నర్సరీల్లో మొక్కలను పెంచడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

దీంతో పర్మన్‌దొడ్డి పల్లె ప్రకృతి వనంలో దాదాపు వందల మొక్కలు వృథాగా.. ఇష్టానుసారం వేశారు. కొన్ని మొక్కలు నీళ్లు లేక ఎండిపోతుంటే.. మరికొన్నింటిని మేకలు, పశువులకు మేపుతున్నారు. భైరంపల్లి నర్సరీ నిర్వహణ లేక పోవడంతో పచ్చగడ్డి మొక్కలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కౌడిన్య మహర్షి జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

గౌడ మూలపురుషుడు కౌడిన్య మహర్షి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 14 : గౌడ కులస్తులకు కౌడిన్య మహర్షి మూల పురుషుడు అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద గురువారం జై గౌడ ఉద్యమం ఆధ్వర్యంలో కౌడిన్య జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కౌడిన్య మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కౌడిన్య మహర్షి జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జైగౌడ జాతీయ అధ్యక్షుడు రామారావుగౌడ్, గోపా అధ్యక్షుడు బండి సాయన్న, హరి శుకర్‌గౌడ్, సత్యం గౌడ్, వేములయ్య గౌడ్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తా : విజయుడు

అలంపూర్ చౌరస్తా, నవంబర్ 14 : నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు తెలిపారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా చూస్తానన్నారు. అయిజ, ఇటిక్యాల మండలాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులు అందజేశామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యాభివృద్ధే లక్ష్యం

- సమష్టి కృషితోనే విశ్వవిద్యాలయానికి మంచిపేరు
- నేను ఒక ఉద్యోగినే.. రిజిస్ట్రార్ అనేది బాధ్యత
- పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 14 : ఉమ్మడి జిల్లాలో ఉన్నత విద్య విస్తరించేందుకు అందివచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానని పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.చెన్నప్ప తెలిపారు. పీయూ పరిపాలన భవనంలో గురువారం రిజిస్ట్రార్‌గా చెన్నప్ప బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమష్టి కృషితోనే విశ్వవిద్యాలయానికి మంచి పేరు వస్తుందన్నారు. తాను ఒక ఉద్యోగినని, రిజిస్ట్రార్ అనేది బాధ్యత మాత్రమే అని పేర్కొన్నారు. సొంత జిల్లాకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టమన్నారు. స్నాతకోత్సవం, నాక్ బృందం పరిశీలనపై మొదటి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. అంతర్గత సౌకర్యాలు మెరుగుపర్చడం, కొత్త కోర్సులు తీసుకురావడం, పీజీ సెంటర్ల ఏర్పాటుపై దృష్టి సారిస్తానన్నారు. ఇదిలా ఉండగా, చెన్నప్ప రిజిస్ట్రార్‌గా పాలమూరుకు రావడంతో ఆయన చెల్లెలు జయమ్మ, తమ్ముడు మునిస్వామి కండ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. అన్నను జయమ్మ మనస్ఫూర్తిగా ఆలింగనం చేసుకుంటూ ఆనందభాష్పాలు రాల్చారు. ఈ సందర్భంగా వారిని శాలువా, పూలమాలలతో సన్మానించారు.

అభినందనల వెల్లువ..

రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన చెన్నప్పను ఉప కులపతి శ్రీనివాస్, ఓఎస్డీటూ వీసీ మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కుమారస్వామి, పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, వివిధ విభాగాధిపతులు అభినందనలు తెలిపారు. పలు విద్యార్థి సంఘాల నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి పూలమాల తోసత్కరించారు.

అంచెలంచెలుగా ఎదిగి..

మక్తల్, నవంబర్ 14 : మండలంలోని కాట్రేవ్‌పల్లికి చెందిన చెన్నప్ప అంచెలంచెలుగా ఎదిగి పీయూ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. దాసరి లింగమ్మ, కుర్మయ్య దంపతులకు ఐదుగురు సంతానం (నలుగురు కుమారులు, ఒక కూతురు). అందులో రెండో వారైన చెన్నప్ప చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా రాణించేవారు. కాట్రేవ్‌పల్లిలో ప్రాథమిక విద్య, మక్తల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాధ్యమిక విద్య, మహబూబ్‌నగర్ బాయ్స్ కళాశాలలో ఇంటర్, ఎంవీఎస్ కళాశాలలో డిగ్రీ, పీజీ సెంటర్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు. 1997లో ఉస్మానియా యూనివర్సిటీలో కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకమయ్యారు. 33 ఏండ్లుగా బోధన, పరిశోధన పరిపాలనలో అనుభవం గడించారు. గతంలో డీన్, ప్రిన్సిపాల్, విభాగాధిపతి, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్, చీఫ్ వార్డెన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. పీయూ రిజిస్ట్రార్‌గా గురువారం చెన్నప్ప బాధ్యతలు చేపట్టడంతో స్థానికులు అభినందనలు తెలుపుతున్నారు. మారుమూల గ్రామంలో పుట్టినా చదువుపై ఆసక్తి ఉండడంతో కష్టపడి ఎన్నో విజయాలు అందుకున్నానని రిజిస్ట్రార్ చెన్నప్ప తెలిపారు.

పీయూ రిజిస్ట్రార్ చెన్నప్పను అభినందిస్తున్న కుటుంబసభ్యులు

రైతులతో విచారణ నిర్వహిస్తున్న అధికారులు

చెల్లించిన రెండేండ్లకు జమ

- గొరిట పీఏసీసీఎస్ రుణాలలో గోల్‌మాల్
- మూడ్రో జల్లో రూ.3.95 కోట్లు కట్టేశారు

తిమ్మాజిపేట, నవంబర్ 14 : మండలంలోని గొరిట పీఏసీసీఎస్‌లో గురువారం విచారణ కోసం వచ్చిన సహకార సంఘం అధికారులకు విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. అసిస్టెంట్ రిజిస్ట్రార్ అంజమ్మ, సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ పురు షోత్తంరావు, మరో అధికారి నగేశ్ విచారణ నిర్వహించారు. సొసైటీలో స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న ఆరుగురు రైతులను పిలిపించి వివరాలను నమోదు చేశారు. రైతులు ఉమాకాంత్(బుద్దస ముద్రం), ద్వాపసు గణమ్మ (మరికల్), అనిల్ (ఆవంచ), దాసర్ల నారమ్మ (కోడుర్తి)తోపాటు మరో కొందరి వివరాలను సేకరించారు. వారంతా 2021-22లో రుణాలు చెల్లించారని, అయితే సొసైటీలో మాత్రం గత నెల (అక్టోబర్-2024) చెల్లించినట్లు ఉందని తెలిపారు. గత నెల 18, 19, 22వ తేదీలలో రూ.3.95 కోట్లు చెల్లించారని అధికారి పురు షోత్తం తెలిపారు. రోజువారీ రికార్డులు నమోదు కూడా సరిగ్గా లేదన్నారు. అయితే రైతులు విండోలో జరుగుతున్న వ్యవహారాలపై తీవ్ర ఆరోపణలు చేశారు. రైతుల వివరాలను డీసీవోకు అందిస్తామని పురుషోత్తం తెలిపారు. సొసైటీలో రుణాలు తీసుకున్న మిగిలిన రైతుల వివరాలను తీసుకునే అవకాశం ఉన్నదన్నారు. విచారణంలో స్థానిక విండో సిబ్బంది పాల్గొన్నారు.

వనపర్తిలో TET- Paper 1 & II
ఉచిత శిక్షణ
తరగతులు ప్రారంభం తేదీ:18-11-2024 సోమవారం, ఉ. 09-00 గంటలకు
ఆవనిగడ్డ, హైదరాబాద్ స్టేట్ ఫేమ్ ఫ్యాకల్టీచే
కేవలం అడ్మిషన్, పరీక్ష ఫీజు మాత్రమే తీసుకోబడును
తేది: నవంబర్ 15,16,17,18,19 తేదీలలో
మీ పేరును రిజిస్ట్రేషన్ చేసుకోగలరు.
శ్రీ జయశంకర్ అకాడమి
9849272349, 8074260130 బంగ్లాదీపురం వనపర్తి